

పీ(లే)జీ..!



- తగ్గిపోతున్న పీజీ కోర్సుల ప్రవేశాలు
- భరోసా ఇవ్వని ప్రభుత్వ యూనివర్సిటీలు
- గత విద్యాసంవత్సరం 50శాతానికే పరిమితం
- అరకొర సౌకర్యాలు.. సిబ్బంది కొరత



బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్నత విద్యాకేంద్రంగా కొనసాగుతున్న రాష్ట్రంలో సాంకేతిక విద్యతోపాటు ఇతర కోర్సులకు ప్రాధాన్యత పెరిగింది. దేశ విదేశీయులు బెంగళూరు సహా పలు నగరాల్లోని విద్యాసంస్థల్లో చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు ప్రాథమిక స్థాయికి నిలిచిపోతున్న విద్య ప్రస్తుతం ఉన్నత విద్య దాకా సాగుతోంది. అందుకు అన్ని ప్రాంతాలలోనూ ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలు ఏర్పాటు కావడం, వాటికి అనుగుణంగా యూనివర్సిటీలు ఏర్పడడం కారణంగా చెప్పవచ్చు. ఇదంతా బాగానే ఉన్నా ఇటీవల కొన్నేళ్లుగా పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు ఎందుకు తగ్గుతున్నారో ప్రభుత్వ యూనివర్సిటీలు గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఈ పరిస్థితి బెంగళూరు యూనివర్సిటీకే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లోనూ ఇదే తరహాలో వెనుకబాటు సాగుతోంది. పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గేందుకు ప్రైవేట్ కళాశాలల సంఖ్య పెరగడం, మారిన విద్యా పాలసీలు, ప్లేస్‌మెంట్, నైపుణ్యతతోపాటు పలు కారణాలు ఉన్నాయి. కొన్ని యూనివర్సిటీల్లో పీజీ సీట్ల కేటాయింపునకు మూడు నుంచి నాలుగైదు రౌండ్ల కౌన్సెలింగ్ జరిపినా సీట్లు భర్తీ కావడం లేదు. ఈ పరిణామం విశ్వవిద్యాలయాలపై పెను ప్రభావం చూపనుంది. ప్రతి యూనివర్సిటీకి ఏటా పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు సంబంధించి సీట్ల భర్తీతోపాటు ఏఏ సబ్జెక్టులపై విద్యార్థులు ఎంచుకున్నారనేది కీలకంగా ఉంటుంది. భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలపై పెను ప్రభావం చూపనుంది. ఇప్పటికే కళాశాలలు, యూనివర్సిటీలలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో ఏటా గెస్ట్ లెక్చరర్లను కాంట్రాక్టు పద్ధతిన నియమించుకుంటున్నారు. మరోవైపు మౌలికసదుపాయాలు కొరత దాదాపు అన్ని యూనివర్సిటీలు ఎదుర్కొంటున్నాయి. కాలానికి తగ్గట్టుగా కోర్సుల అధ్యయనంలో ఎటువంటి ప్రయోజనాలు ఉన్నాయి. వాటి ద్వారా ఉద్యోగాలు ఉన్నత చదువులకు ఏ విధంగా సహకారం కానుందనేది విద్యార్థులకు వివరించే విషయంలో యూనివర్సిటీలు విఫలం అవుతున్నాయి. కోర్సులను అప్‌డేట్ చేయకపోవడం, అంతిమంగా ప్రతి విద్యార్థి భావించే ఉద్యోగానికి తగిన ప్రాధాన్యం అందకపోవడంతో ప్రభుత్వ యూనివర్సిటీలలో పీజీ కోర్సుల్లో చేరేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. బెంగళూరు యూనివర్సిటీ పరిధిలో గతంతో పోలిస్తే కళాశాలల సంఖ్య పెరిగింది. అయితే వృత్తి విద్యాకోర్సులకు వెళ్తే తప్పనిసరిగా ఉద్యోగాలు లభిస్తాయని, పైగా క్యాంపస్ ఇంటర్వ్యూ వంటి సదుపాయాలతో చదువు పూర్తి కాగానే ఉద్యోగం లభిస్తుందని యువ విద్యార్థులు భావిస్తున్నారు. ఇలాంటి సౌలభ్యాలు ప్రైవేట్ కళాశాలలు, యూనివర్సిటీలు ప్రత్యేకంగా అమలు చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ యూనివర్సిటీలలో పీజీ కోర్సులలో చేరేందుకు వెనుకబడుతున్నట్టు తెలుస్తోంది.

బెంగళూరు యూనివర్సిటీలో అడ్మిషన్ల వివరాలు

2020-21 విద్యాసంవత్సరంలో 2,939 పీజీ సీట్లకు గాను 2,227 సీట్లు భర్తీ అయ్యాయి. 2021-22లో 3,037 పీజీ సీట్లకుగాను 1,139 మంది చేరారు. 2022-23లో 2,962 పీజీ సీట్లకు గాను 2,156 మంది చేరారు. 2023-24లో 3,657 పీజీ సీట్లకుగాను 1,882 మంది మాత్రమే చేరారు. దీన్నిబట్టి 50శాతం సీట్లు ఖాళీగా ఉన్నట్లయ్యింది. రాష్ట్రంలో ఉన్నత విద్య గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, రాష్ట్రవ్యాప్తంగా 36.2గా ఉంది. దీన్ని 50శాతం పెంచాలని ప్రభుత్వ భావిస్తోంది. ఆ దిశగా ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అయితే ప్రభుత్వ యూనివర్సిటీల్లోనే పీజీ అడ్మిషన్లు గణనీయంగా తగ్గడం ఉన్నత విద్యాశాఖ లక్ష్యాన్ని అధిగమించడం సాధ్యమేనా అనిపిస్తోంది. ఇటీవల పీజీ కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిన అంశంపై సిండికేట్ సభలో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తగిన చొరవ చూపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మారిన విద్యా పాలసీలతోపాటు నిరుద్యోగ సమస్య కూడా యువత పీజీలవైపు వెళ్లకపోవడానికి కారణమవుతోంది. డిగ్రీ ముగిసిన తర్వాత లభించిన ఉద్యోగంతోనే సరిపెట్టుకుంటున్నారు. పీజీ చదివేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ ఉద్యోగాలకు పీజీ, పీహెచ్‌డీ వంటి కోర్సులు తప్పనిసరి చేయాలనే నిబంధన ఉంటే అటువంటి ఆశయం కల్గినవారు మాత్రమే పీజీలవైపు చేరుతున్నారని బెంగళూరు విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ ఎస్ఎం జయకర్ అభిప్రాయపడ్డారు.



నోటికొచ్చినట్లు మాట్లాడారు..!

- మహిళ అని సానుభూతి కూడా చూపలేదు
- రాష్ట్రపతి, ప్రధానిని కలిసి వివరిస్తా: మంత్రి హెబ్బాళ్కర్



బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో బీజేపీ సభ్యుడు సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలతో అవమానం జరిగిందని మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ విచారం వ్యక్తం చేశారు. బెళగావిలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళ అనే కనీస సానుభూతి లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడి సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారని సీటీ రవిపై మండిపడ్డారు. రెండురోజులపాటు ఇంటినుంచి బయటకు రాలేదని కనిపించినవారందరికీ ఏమని చెప్పుకోవాలని, ఓ మహిళగా ఎంత కుమిలిపోయానో తనకే తెలుసన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నకిలీ ఎన్‌కౌంటర్ పదాలు వాడుతున్నారన్నారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు తనకు జరిగిన అవమానంపై లేఖలు రాస్తానన్నారు. అవకాశం లభిస్తే రాష్ట్రపతి, ప్రధానిని భేటీ అవుతానని, పరిషత్ నిండుసభలో జరిగిన అవమానాన్ని వివరిస్తానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీకి సిద్ధంగా లేనని, న్యాయపోరాటం చేస్తానన్నారు. కాగా సీటీ రవి వ్యాఖ్యానించినట్లుగా ఉండే ఆడియోను మంత్రి విడుదల చేశారు.

ఆ వివాదం ముగిసిన అధ్యాయం ... సభాపతి హొరట్టి

పరిషత్‌లో జరిగిన ఘటనకు పోలీసుల జోక్యం చేసుకోరాదని పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి మండిపడ్డారు. సోమవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సీటీ రవిల వివాదం ముగిసిన అధ్యాయమన్నారు. 19వ తేదీనే సభలో రూలింగ్ చేశానని, సభను నిరవధికంగా వాయిదా వేశామన్నారు. సభలో జరిగే సంఘటనలపై పోలీసులు జోక్యం చేసుకోరాదన్నారు. పంచనామా చేసేందుకు పోలీసులు కోరారని, తాను అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిషత్ తలుపులు వేశామని, పంచనామా చేసేందుకు వీలుండదన్నారు. బయట అంశాలపై తాను జోక్యం చేసుకోనన్నారు. సభ జరిగే సమయంలో ఎటువంటి వివాదం లేదని కలాపాలు ముగిశాక జరిగే వివాదంలో తమకు సంబంధం లేదన్నారు. సీటీ రవి అరెస్టుతో తమకు నేరుగా సంబంధం లేదన్నారు. ఆడియో రికార్డు కాలేదని, సాక్ష్యాలు మాత్రమే ఉన్నాయన్నారు. రికార్డులు పరిశీలించామని, ఆడియోలో ఎటువంటి విషయాలు లభించలేదన్నారు. ఇద్దరి నుంచి ఫిర్యాదు తీసుకున్నానన్నారు. ఆరోజు రాత్రి ఒంటి గంట వరకు సీటీ రవితో మాట్లాడానన్నారు. నగర పోలీస్ కమిషనర్‌తో చర్చించానన్నారు. పరిషత్ ప్రాంగణలో సభ్యుడు సీటీ రవిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, కమిషనర్‌లకు సూచించానన్నారు.

సుమోటోగా కేసు

పరిషత్ ప్రాంగణంలో సభ్యుడు సీటీ రవిపై దాడికి పాల్పడిన సంఘటనకు హిరేబాగేవాడి పోలీసులు సుమోటోగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈమేరకు వీడియోలు, ఫొటోల ఆధారంగా వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే సీటీ రవిపై అదే రోజు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు పరిపాలనా కేంద్రం సువర్ణసౌధలో సీటీ రవిపై దాడి సంబంధించి కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి స్పందిస్తూ బెళగావి పోలీస్ కమిషనర్ హోదాకు అనర్హుడని మండిపడ్డారు. కాగా తన ఫిర్యాదుకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు కాకుంటే చలో బెళగావి యాత్ర చేస్తానని సీటీ రవి తెలిపారు.



మాట్లాడుతున్న కృషి సమాజ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి

గిట్టుబాటు ధరతోనే కిసాన్ దివస్‌కు సార్థకత

- రైతు సంఘం నాయకులు

7



నిరసనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసు

అమిత్‌షా వ్యాఖ్యలపై డీఎస్ఎస్ నిరసన

- బళ్లారిలో పదాధికారుల అరెస్ట్

8



నగరంలో క్రిస్మస్ సందడి

- కొనుగోళ్లతో వీధులన్నీ కిటకిట

7

కాంగ్రెస్‌వి కల్లబొల్లి మాటలు

- హాసన్‌కు కాంగ్రెస్ చేసింది శూన్యం
- సీడీల విడుదలే వారి గొప్పతనం : కేంద్రమంత్రి కుమారస్వామి



రంగనాథస్వామి ఆలయం వద్ద పార్టీ నేతలతో కుమారస్వామి

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు చెప్పేవి కల్లబొల్లి మాటలని, హాసన్ జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ ఏమీ లేదని, సీడీలు విడుదల చేయడమే వారి గొప్ప అని కేంద్రమంత్రి కుమారస్వామి ఎద్దేవా చేశారు. హాసన్ జిల్లాలో సోమవారం కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. జిల్లాకు దేవెగౌడ కుటుంబం చేసింది ఏమిటని ఇటీవల డీసీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. హాసన్ జిల్లాకు కాంగ్రెస్ నాయకులు ఏం చేశారని తిరిగి ప్రశ్నించారు. సీడీలు విడుదల చేసి ఎంతో సాధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాసన్ అభివృద్ధి అనేది దేవెగౌడ రాజకీయ ప్రారంభం నుంచి కొనసాగించిన రోజునుంచే జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. వీరు ఓ ఫ్లై ఓవర్ సాధించలేదని, సిగ్గు లేకుండా మాట్లాడతారన్నారు. తాను సీఎంగా ఏమి చేశాననేది జిల్లాలో అందరికీ తెలుసునన్నారు. పలు అభివృద్ధి పనులకు తన హయాంలోనే శ్రీకారం చుట్టానన్నారు. తమ కుటుంబం ప్రజల సొమ్మును లూటీ చేయలేదన్నారు. ప్రకృతిని లూటీ చేసిన వారెవ్వరనేది అందరికీ తెలిసిందేనన్నారు. దొంగే దొంగ..దొంగ..అన్నట్లుగా కాంగ్రెస్ నేతల మాటలు ఉన్నాయన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి చన్నరాయపట్టణ తాలూకాలోని దేవీరమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు ఆలయాలను సందర్శించారు. అనంతరం కాఫీ రైతులతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌తో కలసి పాల్గొన్నారు.



శతాబ్ది ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సుర్జేవాలా తదితరులు

అన్ని పార్టీలకు ఆహ్వానం

- చరిత్రలో గుర్తుండిపోయేలా కాంగ్రెస్ శతాబ్ది ఉత్సవాలు
- అన్ని రాష్ట్రాల నుంచి నేతల రాక : డీసీఎం డీకే

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గాంధీ సమావేశానికి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా బెళగావిలో నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. బెళగావిలో సోమవారం సువర్ణసౌధ వద్ద 'గాంధీ భారత కార్యక్రమం' ఏర్పాట్ల పరిశీలనకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తో కలసి సందర్శించారు. అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ 1924లో మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే వేళ జవహర్‌లాల్ నెహ్రూ, కర్ణాటకకు చెందిన గంగాధర దేశ్‌పాండేలు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులుగా ఉండేవారన్నారు. వారిద్దరూ బెళగావి కాంగ్రెస్ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు కావాలని మహాత్మాగాంధీని కోరారన్నారు. ఇలా బెళగావి కాంగ్రెస్ సభకు చరిత్ర ఉందన్నారు. ఇక్కడనుంచే గాంధీజీ దేశ స్వాతంత్ర్య పోరాటానికి నేతృత్వం వహించారన్నారు. 2023 ఎన్నికల వేళ ఇక్కడనుంచే ప్రజాధ్వని యాత్రను ప్రారంభించి రాష్ట్రంలో సుదీర్ఘకాలం తర్వాత అత్యధికంగా 136 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని సురక్షితమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇదే గడ్డనుంచి దేశం, రాష్ట్రాన్ని ఏ దిశగా తీసుకెళ్లాలనేది తీర్మానిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను చర్చించి ఏ విధంగా పోరాటాలు చేయాలనేది కమిటీలో తీర్మానిస్తామన్నారు. సువర్ణసౌధ, గాంధీ విగ్రహ ఆవిష్కరణకు ప్రతిపక్షాల నాయకులు, ఎంపీలు, ఉభయసభల సభాధ్యక్షులు, సభాపతులతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరినీ ఆహ్వానిస్తామన్నారు. గాంధీ విగ్రహావిష్కరణ పూర్తిగా ప్రభుత్వ కార్యక్రమమన్నారు. భద్రతా దృష్ట్యా ప్రజలకు ఆహ్వానం లేదన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులంతా పాల్గొంటారన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 500-600 మంది నాయకులు మాత్రం పాల్గొంటారన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, అన్ని రాష్ట్రాల సీఎల్పీ నాయకులు పాల్గొంటారన్నారు.

నేనింకా బతికే ఉన్నా.. కాంగ్రెస్ అధ్యక్షుడిని నేనే: డీకేశి

నేనింకా బతికా ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నానని బీజేపీ చేపట్టే నిరసనలకు భయపడేది లేదని డీసీఎం డీకే శివకుమార్ సవాల్ చేశారు. బెళగావిలో జరిగే కాంగ్రెస్ శతాబ్ది ఉత్సవాల వేళ బీజేపీ నిరసనలు చేపట్టేందుకు సిద్ధమైందనే మీడియా ప్రశ్నకు సమాధానమిచ్చారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దేశ స్వాతంత్ర్యపోరాటం చేసినవారన్నారు. జాతీయగీతం, జాతీయజెండా ఇచ్చారని ఇవన్నీ ఆయన పోరాట ఫలితంతో వచ్చినవన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవిని అరెస్టు చేసి రాత్రంతా తిప్పారనే అంశంపై మాట్లాడుతూ పోలీసులు ఏం చేశారో హోం మంత్రి సమాధానమిస్తారన్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి వ్యాఖ్యలపై స్పందించేది లేదని దాటవేశారు.

వయనాడ్‌లో వంద ఇళ్లు

- సీఎం లేఖకు కేరళ ముఖ్యమంత్రి సమాధానం

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వయనాడ్‌లో వరదబాధితులకు వంద ఇళ్లను నిర్మిస్తామని కర్ణాటక సీఎం సిద్దరామయ్య రాసిన లేఖకు కేరళ ముఖ్యమంత్రి తనదైన శైలిలోనే దీటుగా స్పందించారు. వయనాడ్ పునరావాసం సహాయానికి కేరళ స్పందించలేదని ఇటీవల సీఎం సిద్దరామయ్య రెండోలేఖను పంపిన విషయం తెలిసిందే. అందుకు కేరళ సీఎం పిణరాయ్ విజయన్ స్పందిస్తూ లేఖ రాశారు. కర్ణాటకతోపాటు సాయం చేసేవారికి ఒక పరిధి సిద్ధం చేస్తున్నామన్నారు. పునరావాసం ప్రతిదశలోనూ ఉండేలా చూస్తున్నామన్నారు. ఇళ్లు కోల్పోయినవారికి పాత స్థలంలోనే టౌన్‌షిప్ నిర్మించాలని భావిస్తున్నామని, ప్రకృతి వైపరీత్యం సాధ్యం లేనటువంటి వైతరి తాలూకాలోని రెండు ప్రదేశాలను గుర్తించామన్నారు. ఇక్కడి టౌన్‌షిప్‌కు సంబంధించి రూపురేఖలు సిద్ధమైన వెంటనే మీకు సమాచారం ఇస్తామన్నారు. వంద ఇళ్లు నిర్మిస్తామన్నందుకు ధన్యవాదాలన్నారు. వయనాడ్‌లో వరద బాధితుల కోసం వివిధ ప్రాంతాలనుంచి సంస్థలు, పారిశ్రామికవేత్తలు ఇతరత్రా వ్యక్తులు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎక్కడ నిర్మించాలనేది నిర్ధారించకముందే నిర్ణయం తీసుకోకూడదని భావించామన్నారు. పర్యావరణ స్నేహిగా ఉండాలని భావిస్తున్నామన్నారు. ఇళ్లు కోల్పోయినవారి భావనాత్మక సంబంధాలను దూరం చేయరాదని ఆలోచిస్తున్నామని లేఖలో ప్రస్తావించారు.



ఆకట్టుకుంటున్న యురేషియన్ పక్షి



హగరి బొమ్మనహళ్ళి వద్ద తుంగభద్ర బ్యాక్ వాటర్‌లో సేద తీరుతున్న విదేశీ పక్షులు

ఆహ్లాదం..!

- తుంగభద్రలో ఆకట్టుకుంటున్న విదేశీ పక్షుల విహారం

బళ్లారి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేల మైళ్లు దాటుకుని ఆకాశంలో ప్రయాణించి వచ్చిన విదేశీపక్షులు తుంగభద్ర బ్యాక్ వాటర్‌లో సేద తీరుతూ సందర్శకులకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతున్నాయి. హగరిబొమ్మనహళ్లి ప్రాంతంలో విదేశీ పక్షులు ఆనందంగా గడుపుతున్నాయి. యురేసియన్ కూట్ (కోడి), ఆసియా ఓపెన్‌బిల్ కొంగ, లిటిల్ ఎగ్రెట్, ఇండియన్ పాండ్ హెరాన్, లిటిల్ కార్మోరెంట్, పెయింటెడ్ స్టోర్క్, కామన్ సండ్ పైపర్, వుడ్‌సాండ్ పైపర్ , వుడ్‌సాండ్‌పైపర్, గ్లోసీఐబిస్, బార్న్‌స్వాలో బ్లాక్‌ర్కెల స్టిల్ట్ రివర్ టెర్న్ తదితర పక్షులు వేల కిలోమీటర్లు పయనించి శీతాకాలంలో ఇక్కడికి వస్తుంటాయి. పుష్కలంగా ఆహారం దొరకడం, వీటికి తోడు నీరు కూడా లభించడంతో ఈ ప్రాంతాన్ని పక్షులు పుట్టినిల్లుగా భావిస్తుంటాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదుగు కూర్చొని పిల్లలు పుట్టిన తరువాత తిరిగి విదేశాలకు పయనిస్తుంటాయి. పక్షుల గుంపును, విచిత్ర శబ్దాలను చూస్తూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ టీచర్లకు కౌన్సెలింగ్

అనంతపురం విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, నగరపాలక సంస్థ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 26 పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయడానికి సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అర్హులైన టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మున్సిపల్ స్కూళ్ల నుంచి వచ్చిన టీచర్లకు డీఈఓ ఆఫీస్‌లో వెరిఫికేషన్ నిర్వహించారు. నగరపాలక సంస్థలో స్కూల్ అసిస్టెంట్స్ గణితం-1, ఫిజికల్ సైన్స్-1, బయాలజీ-1, సోషియల్-1 పోస్టు, పీఎస్ హెచ్‌ఎం-2, మున్సిపాలిటీల్లో స్కూల్ అసిస్టెం ట్స్ గణితం తెలుగు మీడియంలో-1, ఉర్దూ మీడియంలో -1, ఫిజికల్ సైన్స్ 2, బయాలజీ-2, సోషియల్-4, పీడీలు-5, పీఎస్ హెచ్‌ఎం-5 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఫైనల్ సీనియారిటీ జాబితాలోని అర్హులైన ఎస్‌జీటీల్లో 1:5 నిష్పత్తిలో టీచర్లను వెరిఫికేషన్‌కు పిలిచి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం రాత్రివరకూ టీచర్లకు పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు.

రాయలచెరువుకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కదరగుట్టపల్లి రెగ్యులేటర్ ద్వారా రాయలచెరువుకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం నీటిని విడుదల చేశారు. రాయలచెరువును నీటితో నింపడం వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కార్యకర్తలో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, చిరంజీవులు, దస్తగిరి, నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్..! న్యాయం చేయండి

● వైద్యమంత్రికి తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్ల వినతి

అనంతపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'కొన్నేళ్లుగా వైద్యశాఖలో పని చేస్తున్నాం. ఇపుడు కోర్టు ఉత్తర్వులు పేరుతో మమ్మల్ని తొలగించారు, మాకడుపు కొట్టకుండా మీరే న్యాయం చేయాలి' అని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎదుట తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లు వేడుకున్నారు. కోర్టు ఉత్తర్వులతో వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉమ్మడి జిల్లాలో 58మంది హెల్త్ అసిస్టెంట్‌లను ఈనెల 5న తొలగించారు. దీంతో సోమవారం ధర్మవరంలో మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను బాధిత హెల్త్ అసిస్టెంట్‌లు కలిశారు. వారు మాట్లాడుతూ.. 2002 నోటిఫికేషన్‌లో తాము పోటీ పరీక్షలు రాశామన్నారు. వివిధ కారణాలతో పోస్టులు భర్తీ చేయకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చారన్నారు. అయితే తాము కోర్టుకు వెళ్లి పోస్టులు తెచ్చుకొని 2016జాయిన్ అయ్యామన్నారు. ఇపుడు మళ్లీ కోర్టు ఉత్తర్వులు అంటూ మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అందరూ 50ఏళ్ల పైబడినవారే ఉన్నామని, ఉద్యోగాలనుంచి తొలగించడం వల్ల మాకుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ ఉన్న వారందరిని ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. చట్ట ప్రకారం న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో బాధితులు అజీజ్, మురళీమోహన్, బాబాఫక్రుద్దీన్, మల్లికార్జున, తిమ్మప్ప, చౌడయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.



టమోటా కాయలపై ఏర్పడిన మచ్చ తెగులు

తెగుళ్లతో... తంటాలు..!

● ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గని వైనం
● నాసిరకం మందులా..? వాతావరణ ప్రభావమా...?
● పంటలను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు



బూడిద, మచ్చతెగుళ్లు సోకిన బీరపంట

కళ్యాణదుర్గం/కుందుర్పి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బోరుబావుల కింద లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్న రైతన్నలను తెగుళ్ల బెడద వీడిస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. దీంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలవుతున్నారు. నాసిరకం మందులు కారణమా.. వాతావరణంలో మార్పుల ప్రభావమా అనేది అంతుచిక్కడం లేదు. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు నలిగిపోతున్నారు. కర్భూజ, కళింగర, టమోటా, బీర, మిరప, మామిడి, వేరుశనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 800 ఎకరాలకు పైబడి ఈ పంటలన్నీ సాగు చేశారు. ఈసారి ఎక్కువగా టమోటా, వేరుశనగ పంటలను సాగు చేశారు. మచ్చతెగుళ్లతో టమోటా పూతంతా రాలిపోయింది. పూతను దక్కించుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బీరకాయ పంటకు కూడా మచ్చతెగులు సోకి ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి బూడిద తెగుళ్లు, నల్లజీడ, పచ్చపురుగు వచ్చి దిగుబడులపై పూర్తిగా ప్రభావం చూపుతోంది. మామిడికి పూత రాలిపోవడం, అగ్గితెగుళ్లు సోకి పంట ఎదుగుదల లేకపోవడంతో పంటను కాపాడుకోలేక పోతున్నారు. దీంతో పాటు మంచు కూడా విపరీతంగా కురవడంతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్కోసారి మందును పిచికారి చేయాలంటే ఎకరాకు సుమారు రూ. 10 వేల దాకా ఖర్చు రావడంతో రైతులు భయపడుతున్నారు. తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాల్సిన ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.



తేనెబంకతో రాలిపోయిన మామిడి పూత, పిందె

అదుపులోకి రాని తెగుళ్లు



నాకున్న 8 ఎకరాల్లో మామిడి పంటను సాగు చేశాను. వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారి చేసినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదు. పూత రాలిపోవడం, పిందె దశలో ఊడిపోవడం, బూడిద తెగుళ్ల ఇలాంటి తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోతున్నాం.

-అవునీరు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పంటలను కాపాడుకోలేకపోతున్నా



నాకున్న 8 ఎకరాల్లో విడతల వారిగా వేరుశనగ, టమోటా పంటలను సాగు చేశాను. తెగుళ్లు భారీగా సోకడంతో పంటలను కాపాడుకోలేకపోతున్నారు. ఉదయం పూట పంటలపై తీవ్రమైన మంచు కురుస్తోంది. దీంతో పంటలకు ఎదుగుదల లేదు. ఆర్థికంగా నష్టపోతున్నాం. బూడిద తెగుళ్లు, మచ్చ తెగుళ్లతో నలిగిపోతున్నాం.

- గౌసిద్ధ, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

పంటను తొలగించేశా



నాకున్న రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. దీనికి సుమారు రూ. 60 వేలకు పైబడి ఖర్చు చేశాను. పంట ఏ మాత్రం ఎదుగుదల లేదు. పంటను కాపాడుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించలేదు. తెగుళ్ల ఉధృతికి రెండు ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను తొలగించేశాను.

- మహేష్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

నల్లమచ్చ తెగులుతో నష్టపోయా..



నాకున్న 8 ఎకరాల్లో విడతల వారిగా టమోటా, వేరుశనగ పంటలను సాగు చేశాను. లక్షలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టాను. టమోటాకు మచ్చ, బూడిద తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. అగ్గితెగుళ్లు, నల్లజీడ, పచ్చపురుగు ఉధృతంగా వ్యాపిస్తున్నాయి. పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నాను.

- శ్రీనివాసులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

● జాతీయ రైతు దినోత్సవంలో ఎంపీ అంబికా



రైతును సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, అన్నదాతలే ఆ గ్రామాలకు ఊపిరి అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, రైతుసంఘాలు, సహాయ రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా ఓ ప్రైవేట్‌హాల్‌లో జాతీయ రైతు దినోత్సవ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ సృష్టిలో భూమిపై సమస్త జీవరాశులు ఆరోగ్యంగా జీవించడానికి అన్నదాతల శ్రమే ప్రధాన కారణమన్నారు. అలాంటి రైతులు బాగుంటేనే గ్రామం, ప్రాంతం, రాష్ట్రం, దేశం బాగుంటుందని తెలిపారు. కిసాన్ రైలు కోసం ప్రయత్నిస్తున్నామని, ఇటీవల తాడిపత్రి నుంచి అరటి పంటను రైలు ద్వారా విదేశాలకు తరలించామన్నారు. ఇదంతా అధికారులు, నాయకుల సహకారంతో సాధ్యమైందని తెలిపారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా ఇళ్లకే పరిమితమైన సమయంలోనూ రైతులు మాత్రమే వ్యవసాయం చేసి ప్రజలకు ఆహారాన్ని అందించారని గుర్తుచేశారు. రైతుసంఘం నాయకులు నరేంద్రస్వరూప్ మాట్లాడుతూ రైతు సహకార వేదిక రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. విద్యుత్తు ప్రమాదంలో మరణించిన రైతుకుటుంబాల సహాయ నిధికి హార్టికల్చర్ రైతుసంఘం నాయకులు భాస్కర్ రూ.25వేలు అందజేశారు. అనంతరం ఆదర్శరైతులు 60మందిని రైతురత్న బిరుదుతో సన్మానించారు. అక్కడే రైతు ఉత్పత్తుల స్టాల్స్‌ను ఎంపి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు భానుజా, రైతు సంఘాల నాయకులు, ప్రముఖులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, యువరైతులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు ఏఎస్‌ఏ, నార్పల

● ముగిసిన రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు



విజేతగా నిలిచిన అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బాలుర విభాగంలో నార్పల, బాలికల విభాగంలో అనంత స్పోర్ట్స్ అకాడమీ(ఏఎస్‌ఏ) జట్లు విజేతలుగా నిలిచాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ ఫైనల్స్ నిర్వహించారు. బాలుర పోటీల్లో ధర్మవరం, నార్పల జట్లు తలపడ్డాయి. నార్పల 34.3ఓవర్లలో 135పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ సంజయ్ 58పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 29.2ఓవర్లలో 69పరుగులకే ఆలౌట్ అయ్యింది. నార్పల బౌలర్లు వర్మేశ్వర్ 3, మహేంద్ర 3, కౌశిక్ 2 వికెట్లు పడగొట్టారు.

● బాలికల పోటీల్లో ధర్మవరం, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి. ఏఎస్‌ఏ 30ఓవర్లలో 4వికెట్లు నష్టానికి 196పరుగులు చేసింది. బ్యాటర్లు ధారామోహన్ 81, చైత్ర 40, రోషనారా 29 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 30ఓవర్లలో ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 147పరుగులు మాత్రమే సాధించింది. బాలికల్లో బెస్ట్ బ్యాటర్ తేజశ్రీ శర్మ-543 (నార్పల), బెస్ట్ బౌలర్ జాహ్నవి-21 వికెట్లు (గుంతకల్లు), మోస్ట్ వ్యాల్యుబుల్ ప్లేయర్ హస్మిత 393పరుగులు, 12వికెట్లు (ధర్మవరం), ఎమర్జింగ్ ప్లేయర్ చైత్ర-476పరుగులు (ఏఎస్‌ఏ)లు నిలిచారు. బాలురలో బెస్ట్ బ్యాటర్ కౌశిక్-707 పరుగులు(తపోవనం క్రికెట్ అకాడమీ), బెస్ట్‌బౌలర్ సంజయ్ 23వికెట్లు (నార్పల), మోస్ట్ వ్యాల్యుబుల్ ప్లేయర్ తన్మయి కార్తికొరెడ్డి 623పరుగులు, 8వికెట్లు, ఎమర్జింగ్ ప్లేయర్ రాజా నిలిచారు. డీఆర్‌ఓ మలోలా ముఖ్య అతిథులుగా హాజరై విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఆర్డీటీ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, సీనియర్ అంపైర్ అన్సర్‌ఖాన్, కోచ్‌లు నరేష్, మహేశ్వర్, కుమార్, బొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



రూరల్‌లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన నార్పల జట్టు



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ఎస్పీ, అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

● జిల్లా ఎస్పీ జగదీష్‌బాబు
● పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి క్రీడా పోటీలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాలోని ఏఆర్, స్పెషల్ పార్టీ విభాగాలతో పాటు ఏడు సబ్ డివిజన్లకు సంబంధించిన పోలీస్ క్రీడా బృందాలు పాల్గొన్నాయి. స్పోర్ట్స్ మీట్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభ సంకేతంగా కాగడా(జ్యోతి) వెలిగించారు. తెల్ల కపోతాలు, బెలూన్లను ఎగురవేశారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న బృందాలను ఎస్పీ పరిచయం చేసుకుని వారి నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో హోదాలు మరిచి అందరూ ఒక టీంగా కష్టించాల్సి ఉంటుందన్నారు. చిన్న పెద్ద అనే భేదాలు లేకుండా సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో బాగా రాణించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం 800 మీటర్ల పరుగు, వాలీబాల్ క్రీడలను ఎస్పీ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు వెంకటేష్, రవిబాబు, రామకృష్ణుడు, ఎస్బీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, సీఐలు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురీదుతున్న ఆంధ్రా

● పటిష్టస్థితిలో మహారాష్ట్ర



సెంచరీ కొట్టిన సుస్రుత్ సావంత్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహార్ అండర్-19 ట్రోఫీలో భాగంగా ఆంధ్రా-మహారాష్ట్ర జట్ల మధ్య జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ పోటీలో ఆంధ్రా జట్టు ఎదురీదుతోంది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో సోమవారం రెండో రోజు ఆట కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 284/5తో రెండో రోజు మహారాష్ట్ర ఆట ఆరంభించింది. మరో 134పరుగులు జోడించి ఆలౌట్ అయ్యింది. దీంతో మహారాష్ట్ర స్కోరు 420పరుగులకు చేరింది. బ్యాటర్లు కిరణ్, సుస్రుత్ సావంత్ సెంచరీలతో రాణించారు. ఆంధ్రా బౌలర్లలో యువన్, ఆదిత్యరెడ్డి చెరో 3వికెట్లు, రాజేష్ 2వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆంధ్రా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 69 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. బ్యాటర్లు వరుణ్ సాత్విక్ 33పరుగులతో నాటౌట్‌గా నిలవగా, లోహిత్ లక్ష్మీనారాయణ 28పరుగులు చేశారు. కార్యక్రమంలో బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోఢీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ మిలింద్‌గుంజాల్, జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఏడీసీఏ కోశాధికారి షబ్బీర్, ఏసీఏ, ఏడీసీఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

తాడిపత్రి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వైష్ణవి పాఠశాలలో ఓపెన్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ముగిశాయని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా సోమవారం తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శివయ్య, వైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తైక్వాండో పిల్లల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా అధ్యక్షుడు శివయ్య చేతులమీదుగా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ పోటీల్లో మొదటి బహుమతి అనంతపురం జట్టు గెలుచుకోగా, రెండవ బహుమతి తాడిపత్రి టీం, అనంతపురం రూరల్ టీం మూడో బహుమతి కైవసం చేసుకున్నాయని ఆయన తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ

ఫ్లై ఓవర్‌కు మోక్షం ఎప్పుడో..!

● ఐదేళ్లుగా ఆగిపోయిన పనులు ● ప్లాన్ మార్చాలని గ్రామస్థుల డిమాండ్



డి.హీరేహాళ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించ తలపెట్టిన ప్రదేశం

డి.హీరేహాళ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఐదేళ్లుగా ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి.. అన్న చందంగా సాగుతున్నాయి. బళ్లారి-బెంగుళూరు జాతీయ రహదారి 150ఏకు సంబంధించి ఐదేళ్ల క్రితమే పనులను ప్రారంభించారు. ఈ జాతీయ రహదారికి డి.హీరేహాళ్ మండల కేంద్రం మీదుగా ఆంధ్ర ప్రాంతంలో సుమారు 11 కి.మీ. పనులు చేపట్టారు. మండల కేంద్రంలో ఇరువైపులా వాహనాల రాకపోకల కోసం 1.7 కి.మీ. మేర ఫ్లైఓవర్ నిర్మాణానికి ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు అది పూర్తి కాలేదు. ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి పనులు అర్థంతరంగా ఆగిపోతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం మినహా రెండు సంవత్సరాలు క్రితమే జాతీయ రహదారి పనులు పూర్తి చేశారు. మొదటిసారి ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపట్టినపుడు భూసేకరణలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇరువైపులా ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. భూసేకరణలో చాలా మందికి పరిహారం అందలేదు. దీంతో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు కొన్ని నెలలు ఆపివేశారు. తిరిగి కొంతమందికి పరిహారం చెల్లించి పనులు మొదలు పెట్టే సమయంలో మళ్లీ భూసేకరణ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అప్పుడు కూడా కొన్ని నెలల పాటు పనులు నిలిపేశారు. ఆలస్యం కావడంతో నిర్మాణ సంస్థ ఈ పనుల నుంచి విరమించుకుంది. ఆరునెలల తర్వాత పనులను మరో నిర్మాణ సంస్థ చేపట్టింది. ఇళ్లు, దుకాణాలను చదును చేసి పనులను ప్రారంభించింది. మండల కేంద్రం మీదుగా కర్ణాటకకు రోజూ వందలాది పెద్ద వాహనాలు వెళుతుంటాయి. ఫ్లైఓవర్‌కు ఇరువైపులా వాహనాలు వెళ్లడానికి చిన్న అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్థులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడ పెద్ద అండర్ పాస్ నిర్మించాలని విన్నవించినా పరిష్కరించకపోవడంతో గ్రామస్థులు మూకుమ్మడిగా పనులను అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతానికి నిర్మాణ పనులు నిలిపివేశారు. దుమ్ము, ధూళి అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య ఎపుడు పరిష్కారమవుతుందో, ఫ్లైఓవర్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ప్లాన్ మార్చి నిర్మించాలి



ప్రతి రోజూ మండల కేంద్రం నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇక్కడి నుంచి ఎంతో ప్రసిద్ధిగాంచిన గవిసిద్ధేశ్వర ఆలయం, కర్ణాటకలోని బసాపురం, మెట్రికి, నాగలాపురం తదితర గ్రామాలకు బస్సులు, లారీలు, పెద్ద పెద్ద వాహనాలు ప్రతిరోజూ వెళుతుంటాయి. వాహనాల రాకపోకల కోసం ఇక్కడ ఒక చిన్న అండర్ పాస్ నిర్మించ తలపెట్టారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అండర్ పాస్ పెద్దదిగా నిర్మించాలి.

-తిప్పేస్వామి, మాజీ సర్పంచ్, డి.హీరేహాళ్

పరిహారం అందలేదు..



జాతీయ రహదారి పనులు మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా చాలా మందికి భూసేకరణకు సంబంధించి పరిహారం అందలేదు. ముఖ్యంగా ఇక్కడ అధిక స్థలం కోల్పోయిన శివలింగతాత మఠం, రాఘవేంద్రస్వామి దేవాలయానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోలేదు. హోటళ్లు, దుకాణాలు కోల్పోయిన చాలామందికి పరిహారం అందలేదు.

- వన్నూరుస్వామి, డి.హీరేహాళ్

ఉన్నతాధికారులకు నివేదించాం..




ఇక్కడ నిర్మించబోయే ఫ్లైఓవర్‌కు సంబంధించి చాలా ఏళ్లుగా నిర్మాణ పనులు అర్థంతరంగా ఆగిపోవడం వాస్తవమే. ముఖ్యంగా ఫ్లైఓవర్ నిర్మాణ లోపంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, రూపకల్పన మార్పు చేసి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. వారి డిమాండ్ మేరకు నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

- అనిల్‌కుమార్, తహసీల్దార్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయన్...

మహమ్మద్ రఫీ (జయంతి)



దేశం గర్వించదగిన నేపథ్య గాయకులలో ఒకరైన 'పద్మశ్రీ' గ్రహీత మహమ్మద్ రఫి 1924 డిసెంబరు 24న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్ జిల్లాలో జన్మించారు. యుగళ గీతాలు, విషాదగీతాలు, ఖవ్వాలి, ఘజల్స్, భజనలు, క్లాసికల్ ఇలా పలురకాల పాటలను ఆలపించారు. నటుడి పెదవి కదలికలకు అనుగుణంగా పాటలు సాగడం ప్రత్యేకత. దేశ విదేశీ భాషలలో 7,405 పాటలు ఆలపించారు. 4 ఫిల్మ్‌ఫేర్, ఒక జాతీయ సినీ పురస్కారం, బెస్ట్ సింగర్ ఆఫ్ మిలీనియం పురస్కారాలు పొందారు. 1980 జూలై 31న కన్నుమూశారు.

ఎంజీఆర్ (వర్ధంతి)



ముఖ్యమంత్రి అయిన తొలి సినీ నటుడిగా గుర్తింపు పొందిన మరుతూర్ గోపాల రామచంద్రన్ (ఎంజీఆర్) 1917 జనవరి 17న శ్రీలంక దేశం కాండీ ప్రాంతంలో జన్మించారు. మళయాళ నాయర్ కుటుంబానికి చెందినవారు. తమిళ సినీ రంగంలోనూ, రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. దాత, సమాజ సేవకుడు. సొంతంగా ఏఐఏడీఎంకే పార్టీని స్థాపించి 1977 నుంచి పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత విస్తృతం చేశారు. పురచ్చి తలైవర్ (విప్లవనేత)గా పేరొందారు. 1987 డిసెంబరు 24న కన్ను మూశారు. ఆయన సాధనలకు మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

దీనానాథ్ భార్గవ (వర్ధంతి)



దీనానాథ్ భార్గవ 1927 నవంబరు 1న మధ్యప్రదేశ్‌లో జన్మించారు. దేశం గర్వించదగిన అంతర్జాతీయ చిత్రకారుడు. జాతీయచిహ్నమైన 'అశోక చక్రం'లోని 'నాలుగు సింహాల గుర్తు', 'సత్యమేవజయతే' గీసిన బృందంలో ఆయన ఒకరు. బట్టలపై మధుబని పెయింటింగ్స్ తెచ్చిన ఖ్యాతి ఆయనదే. వాష్ పెయింటింగ్స్ ఆయన ప్రత్యేకత. ఆలిండియా హ్యాండ్‌లూమ్ బోర్డ్ డైరెక్టర్‌గా కొనసాగారు. 2016 డిసెంబరు 24న కన్నుమూశారు.

అనిల్ కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన నటుడు, నిర్మాత అనిల్ కపూర్ 1956 డిసెంబరు 24న ముంబైలో జన్మించారు. బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ సోదరుడు. 40ఏళ్లలో వందకుపైగా హిందీ సినిమాలలో నటించారు. తెలుగులో బాపు దర్శకత్వంలో 'వంశవృక్షం'లో నటించారు. రెండు జాతీయ, ఆరు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. నాలుగు దశాబ్దాలలో బుల్లితెరపైనా, వెండితెరపైనా తనదైన ప్రత్యేకత చాటుకున్నారు.

దగ్గుబాటి సురేశ్‌బాబు (పుట్టినరోజు)



దగ్గుబాటి సురేశ్‌బాబు 1958 డిసెంబరు 24న జన్మించారు. ప్రముఖ నిర్మాత డీ రామా నాయుడి పెద్ద కుమారుడు. తండ్రి బాటలోనే సినీ నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా కొనసాగుతున్నారు. సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పలు విజయవంతమైన సినిమాలు రూపొందించారు. చిత్ర నిర్మాణరంగంలోకి 1982లో 'దేవత' అడుగు పెట్టినా బొబ్బిలిరాజా సినిమాతోనే నిర్మాతగా పేరు వేసుకున్నారు. 1999లో 'కలిసుందాం రా..' సినిమాకు జాతీయ అవార్డు దక్కింది. నంది, ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు పొందారు. 2011-12లో ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అధ్యక్షులుగా వ్యవహరించారు.

నీరజ్ చోప్రా (పుట్టినరోజు)



జావెలిన్ త్రో క్రీడలో జాతీయ స్థాయిలో రాణించిన నీరజ్ చోప్రా 1997 డిసెంబరు 24న హర్యానా రాష్ట్రం ఖాండ్రా ప్రాంతంలో జన్మించారు. ఇండియన్ ట్రాక్ అండ్ అథ్లెట్ క్రీడాకారుడు. ఆర్మీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదా. 2016 ఐఏఎఫ్ వరల్డ్ యూ20 ఛాంపియన్‌గా నిలిచారు. 2018 ఏషియన్ గేమ్స్‌లో దేశం తరపున ఫ్లాగ్ బేరర్‌గా ఎంపికయ్యారు. ఐఏఎఫ్ డైమండ్ లీగ్ పోటీల్లోనూ పాల్గొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం టోక్యో 2020 పోటీల్లో పాల్గొన్నారు. 2023 వరల్డ్ అథ్లెటిక్స్‌లోనూ బంగారు పతకం సాధించారు.

టమోటా కిలో రూ. 7

అనంతపురం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.33వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 33,190 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కా ర్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠం గా రూ. 12 వేలు, సరాసరి రూ. 25 వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపా రు. మార్కెట్‌కు మొత్తం 20 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధిత మహిళల స్వయం ఉపాధి కోసం చేతివృత్తులపై శిక్షణ కల్పించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా వైద్యశాఖ పరిధిలో గుర్తించిన బాధితులకు పంగల్ రోడ్డు సమీపంలో గల ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో కుట్టు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విజయవాడకు చెందిన ఏఎన్‌పీ, సిద్ధి, ఉషా, డీఎంహెచ్ సంస్థలు హెచ్‌ఐవీ బాధితులకు కుట్టు శిక్షణకు సహకారం అందిస్తున్నారు. తొమ్మిది రోజులుపాటు ఈకుట్టు శిక్షణ ఇవ్వనున్నారు. ఈశిక్షణకు జిల్లాలోని 25మంది హెచ్‌ఐవీ బాధితులు హాజరయ్యారు. వారికి ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టరు గంగాధరరెడ్డి చేతులు మీదుగా కుట్టు మెషీన్లకు సంబంధించిన సామగ్రిని సోమవారం అందజేశారు.

గిట్టుబాటు ధరతోనే కిసాన్ దివస్‌కు సార్థకత

- కిసాన్ దివస్‌లో రైతు సంఘం నాయకులు



బాగేపల్లిలో రైతు దినోత్సవం

బంగారపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాతలు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించడం ద్వారానే కిసాన్ దివస్‌కు సార్థకత సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కృషిక సమాజ భవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల దినోత్సవాన్ని సోమవారం జరిపారు. తాలూకా కృషిక సమాజ అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌చౌదరి స్మరణార్థం జాతీయ రైతుల దినోత్సవాన్ని (కిసాన్ దివస్) నిర్వహిస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వివిధ తర్ఫీదు తరగతులు ఇస్తున్నారని, సాగులో అధిక దిగుబడి పొందేలా చేయడం ద్వారా రైతులలో ఆత్మస్థైర్యం నింపుతున్నారన్నారు. యువతను సాగువైపు మళ్లింపు చేసేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రామేగౌడ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అంటారని అయితే వారికి అవసరమైన సౌకర్యాలు అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. కాగా కరువు పరిహారం రైతులకు సకాలంలో అందడంలో చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. రైతులు పండించే పంటలకు సరైన ధర లభించడం లేదన్నారు. పంటలకు కనీసధర ఉండాలన్నారు. రానురాను సాగు భారంగా మారిందని ప్రభుత్వాలు అన్నదాతలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, నీటి వ్యవస్థ, మార్కెట్ కల్పించడం ద్వారా అన్నదాతలకు భరోసాగా ఉండాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి ప్రతిభా, ఉద్యానవనాలశాఖ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికత ప్రయోజనాలు

బాగేపల్లి: ఆధునిక సాంకేతిక ప్రయోజనాలను సాగులో అమలు చేసి ప్రయోజనాలు పొందాలనాని వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ లక్ష్మి అభిప్రాయపడ్డారు. సేంద్రీయ ఎరువుల వాడకం, విత్తనశుద్ధి, నూతన పద్ధతులను అమలు చేయడంతోపాటు పాడిపెంపకం, తోటలు, కోళ్లు, గొర్రెల పెంపకం వాటి ద్వారా సమగ్ర సాగుతో ఆదాయం పెంచుకోవచ్చునన్నారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ కార్యాలయ సభాంగణంలో మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఐదో ప్రధాని చౌదరిచరణ్‌సింగ్ జయంతిని కిసాన్ దివస్‌గా ఆచరిస్తున్నారన్నారు. ఆయన తన పాలనలో రైతులకోసం ఎన్నో పథకాలు రూపొందించి అమలు చేశారన్నారు. కాగా వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహా సూచనలు పొంది దిగుబడి పెరగడం ద్వారా రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కర్ణాటక రాష్ట్ర హసిరుసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరెడ్డి, రైతు నాయకుడు ఎంఎస్ నరసింహరెడ్డి తదితరులు ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యానవనాలశాఖ డైరెక్టర్ లలిత, సిబ్బంది బాబు, చంద్రశేఖర, దివ్యజ్యోతి, మధుశ్రీ, దివ్యా, రైతు ప్రముఖులు ఈశ్వరరెడ్డి, రామాంజి సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతకు అనుగుణంగా బోధనలు

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బోధనలో మార్పు ఉండాలని పీఈఎస్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సూర్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఫ్యాకల్టీ మేనేజిమెంట్ కామర్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ లర్నింగ్ డెవలెప్‌మెంట్ పేరిట సదస్సు జరిగింది. సోచ్ అపెరల్స్ పార్క్ చీఫ్ మార్కెటింగ్ అధికారి దీపక్ మహనోత్ మాట్లాడుతూ రేపటికోసం ఆవిష్కరణలు కీలకమని అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి, ధర, ప్రాంతం వంటివి ఆధునిక మార్కెట్ కీలక అంశాలన్నారు. ఏఐ ఆధారిత ఉత్పత్తులలో ఆధునికత సాధ్యమవుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పలువురు పాల్గొని వివిధ అంశాలపై పేపర్ ప్రెజెంటేషన్ చేశారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

అలరించిన సంగీత కార్యక్రమం

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని లాస్య రంజని కళాక్షేత్ర ఆడిటోరియంలో కన్నడ సంస్కృతిశాఖ, కెనరాబ్యాంకు సహకారంతో కళా 64 సంస్థ వార్షిక సంగీత, నృత్య ఉత్సవం సభికులను అలరించింది. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో శ్రీనాథ్, గురువు డాక్టర్ సోని హేమంత్, సేతురమ్మ ముఖ్యులుగా పాల్గొన్నారు. సీనియర్ కళాకారులు జయశీల, డాక్టర్ హని ఉన్నికృష్ణన్, ఎంఎస్ బ్రిస్టిలు సమర్పించిన భరతనాట్యం, కూచిపూడి, మోహినీయాట్టం నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గణేశ స్తుతితో ప్రారంభమైన ప్రదర్శన మద్రాష్టకం తదితర కార్యక్రమాలు సాగాయి. గురు డాక్టర్ సరస్వతి శిష్యులు ప్రదర్శనలు ఇచ్చారు. కళా 64 ట్రస్టు ప్రధాన సభ్యుడు గాన కళాభూషణ పల్లవి జనార్దన్‌చే కర్ణాటక గాత్రకచేరి ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు.



కళాకారుల బృందం

శాంతిభద్రతలకోసం సీసీటీవీలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై వేణుగోపాల్

శిడ్లఘట్ట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను కాపాడేందుకు బార్ అండ్ రెస్టారెంట్‌లు వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను అమర్చాలని పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై వేణుగోపాల్ నిర్వాహకులకు సూచించారు. పట్టణంలో ఆయన ప్రత్యేకంగా బార్ అండ్ రెస్టారెంట్‌ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఇటీవల బార్‌ల వద్ద గొడవలు చోటు చేసుకుంటున్నాయని తద్వారా ప్రజలకు సమస్యలు తలెత్తు తున్నాయన్నారు. మద్యం మత్తులో ఎవరో దాడి చేయడం మరెవరో సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు అందరూ సహకరించాలన్నారు. బార్‌లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అత్యవసర సమయంలో 11కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో బార్ యజమానులు రామకృష్ణప్ప, జయరాం, ప్రకాశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాఠాలతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

బొమ్మనహళ్ళి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలకే పరిమితం కాకుండా క్రీడలకు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని చిన్మయ విద్యాసంస్థల చైర్మన్ కే వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. బీబీఎంపీ వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్ సోమసుందరపాళ్యలోని చిన్మయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం వార్షిక క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్, టెన్నిస్, క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు సాయంత్రం వరకు సాగాయి. పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రొఫెసర్ అమరావతి, డైరెక్టర్‌లు రంజిత్, సౌమ్య, ప్రజ్వల్, ప్రిన్సిపాల్ మిత్ర రూబిని, పెద్దసంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వాసుదేవరెడ్డి

రోడ్డుపనులు పరిశీలించిన మంత్రి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మంత్రి సుధాకర్

చింతామణి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలదాకా రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. 12 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఆదివారం స్వయంగా పరిశీలించారు. బెంగళూరు డబుల్‌రోడ్డుకు అనుబంధంగా ఉన్న కన్నంపల్లి కొండవద్ద రూ.149 కోట్లతో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడే అన్ని హంగులతో ప్రవాసి మందిరం నిర్మిస్తుండడంతో మొదటిదశలో రూ.6కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించారు. వర్షపునీరు సజావుగా వెళ్లేలా కాలువ, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాల తరగతులను ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలోని తాత్కాలిక భవనంలో ఇప్పటికే ప్రారంభించామన్నారు. కళాశాలకు మొదటిదశలో 10 ఎకరాలు, మరో 2 ఎకరాలు సమకూర్చామన్నారు. కొండపై నిర్మాణాలు చేపడుతున్న కారణంగా మరిన్ని జాగ్రత్త చర్యలు పాటించేలా ఇంజనీర్లకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాపనులశాఖ సహాయక ఇంజనీర్ నాగరాజ్, జూనియర్ ఇంజనీర్ శ్రీశైల, హరీశ్, కాంట్రాక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రిస్మస్ సందడి



క్రిస్మస్ స్టార్‌ల విక్రయాలు

బెంగళూరు నగరంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. నగరంలోని బ్రిగేడ్ రోడ్డు, శివాజినగర్, చర్చ్‌స్ట్రీట్, కోరమంగల ప్రాంతాలలో సందడి నెలకొంది. ప్రత్యేకించి చర్చ్‌స్ట్రీట్‌లో విద్యుద్దీపాలంకరణ చూపరులను ఆకట్టుకుంటోంది.
(ఆంధ్రజ్యోతి, బెంగళూరు)



చర్చ్ స్ట్రీట్‌లో అలంకరణ

గుడిలో సిలిండర్ పేలి...
అయ్యప్ప భక్తులకు తీవ్ర గాయాలు

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి నగర పరిధి సాయినగర్ అబ్బవ్వ కాలనీలో వెలసిన ఈశ్వర ఆలయంలో సోమవారం తెల్లవారు జామున వంటగ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో 9మంది అయ్యప్ప భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రాత్రి 1.30గంటల తర్వాత ఒక్కసారిగా సిలిండర్ పేలిపోవడంతో గుడిలో నిద్రిస్తున్న అయ్యప్ప భక్తులు గాయపడినట్లు విద్యానగర్ పోలీసులు తెలిపారు. అజ్జాస్వామి(58) పరిస్థితి విషమంగా మారగా దాదాపు భక్తులందరూ 50శాతంకు పైగా గాయపడినట్లు ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. రాజు హర్లాపుర(21), సంజయ్ సవదత్తి(20), వినాయక బాతకేర(12), ప్రకాష్ బాతకేర(42), మంజు తోరద(22),. అజ్జాస్వామి(58), ప్రవీణ్ చలవాది(24), తేజస్‌రెడ్డి(26), శంకర రాయనగౌడ(29)లు గాయపడినవారు. వీరంతా సాయి నగర్‌లో నివసించేవారుగా గుర్తించారు. ఇదే ప్రాంతానికి చెందిన వారు అయ్యప్ప దీక్షలో ఉండేవారంతా నిత్యం గుడిలోనే గడుపుతున్నారు. రాత్రి, తెల్లవారున భజనలు చేయడంతో పాటు ఇక్కడే బస చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఓ భక్తుడు నిద్రిస్తున్న వేళ కాలికి తగిలి సిలిండర్ కిందపడిపోయింది. సిలిండర్‌కు అమర్చిన రెగ్యులేటర్ కదిలి గ్యాస్ లీకేజి అయ్యింది. గుడిలో వెలిగించిన దీపం దాకా గ్యాస్ వ్యాపించడంతో మంటలు చెలరేగి సిలిండర్ పేలిపోయినట్లుగా భావిస్తున్నారు. గుడి పూర్తిగా మంటలు చెలరేగడంతో స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని అయ్యప్ప భక్తులను రక్షించారు. గాయపడిన వారందరినీ ఆసుపత్రికి తరలించారు. డీసీపీ నందగావి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కాగా అయ్యప్ప భక్తులకు చికిత్సలు అందించడంలో జాప్యం జరగడంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి మండిపడ్డారు.

కేరళ వరద బాధితులకు బీఈఎల్ రూ.1.89కోట్లు విరాళం

బెంగళూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేరళ వరద బాధితుల సాయం కోసం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) 1.89 కోట్ల రూపాయలను సీఎం సహాయనిధికి అందించారు. బీఈఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ దామోదర్ భట్టడ్, హెచ్‌ఆర్ డైరెక్టర్ విక్రమన్‌లు సోమవారం కేరళ సీఎం పినరాయ్ విజయన్‌కు రూ.1,89,13,013ల చెక్కును అందచేశారు. బీఈఎల్ సెక్యూరిటీ సర్వీసెస్ చీఫ్ అనూప్‌నాయర్ తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు.



కేరళ సీఎంకు చెక్కు అందజేత

పీహెచ్‌డీకి ఎంపికైన బాబురాజ్



బాబురాజ్

బెంగళూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవహక్కుల విభాగంపై సుదీర్ఘంగా పరిశోధనలు చేసిన బెంగళూరుకు చెందిన బాబురాజ్‌కు ద్రవిడన్ యూనివర్సిటీ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. హ్యూమన్‌రైట్స్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా ఏ స్టడీ ఆన్ ది కాన్సెప్ట్ ప్రమోషన్ అండ్ నేషనల్ ఇన్సియేటివ్ అంశంపై పరిశోధన చేశారు. ఈమేరకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు ఎంపిక చేసినట్టు పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ మూర్తి ఇటీవల ప్రకటించారు. తదుపరి స్నాతకోత్సవం వేళ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్టు ప్రకటించారు.

రెండు ప్రాంతాల్లో ప్రమాదాలు ఐదుగురి మృతి

బెంగళూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధారవాడ, శివమొగ్గ జిల్లాల్లో రెండు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. దారవాడ జిల్లా అళ్నావర తాలూకా కడబగట్టి వద్ద గోవా రహదారిపై ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ఐచర్ వాహనాన్ని క్యాంటర్ బోల్తాపడి ఢీకొనడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. శిరసంగికి చెందిన మహనుమంతప్ప మల్లాడ (45), మహంతేశ్ చౌహాన్ (40), మహదేవ హాళ్కెి (40) మృతులుగా గుర్తించారు. మరో ఐదు గురు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించారు. క్యాంట ర్‌లోని ముగ్గురు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. టెంపో ట్రావెలర్‌లోని ఇద్దరు ప్రయాణీకులు గాయపడ్డారు.

కాగా మరో ఘటనలో శివమొగ్గ నగరంలోని సర్క్యూట్‌హౌస్ సర్కిల్‌లో ఆదివారం అర్ధరాత్రి అనంతరం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. బైక్, బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఒక యువకుడు ఘటనా స్థలంలో మృతి చెందగా మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తూర్పు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగింది. మృతుల వివరాలు తెలియరాలేదు.




దారవాడ జిల్లాలో ఘటనా స్థలం వద్ద వాహనాలిలా...

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

తాడిపత్రి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామసమీపంలో వంశీ (26) అనే యువకుడిని అతడి మిత్రులే రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రావి వెంకటాంపల్లికి చెందిన వంశీ ఐషర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. సోమవారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి మద్యం సేవించడానికి గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లోకి వెళ్లారు. కొంత సమయం తర్వాత వీరి మధ్య మద్యం విషయంలో గొడవపడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన మిత్రులు వంశీని రాళ్లతో కొట్టి చంపారని తెలిపారు. అనంతరం వీరు పరారయ్యారని సీఐ తెలిపారు. గతంలో వంశీ ఇదే గ్రామానికి చెందిన పలువురు యువకులతో ఐషర్ బాడుగ విషయంలో గొడవ పడ్డాడని తెలిపారు. ఈ కోణంలో కూడా విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య అంజలి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన ఉపాధ్యాయులు

కదిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు టీచర్లు పేకాట ఆ డుతూ పట్టుబడ్డారు. స్థానిక నిజాంవలి కాలనీలో సోమవారం రాత్రి పే కాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.1.12 లక్ష లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నట్లు చెప్పారు. పట్టుబ డిన వారిని మంగళవారం తహసీల్దార్ ముందు హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.17	1,589.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	933	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,409	882
నీటి నిల్వ (టీఎంసీలు)	87.35	10.74

వాణిజ్య పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి

● రైతు దినోత్సవాల్లో వ్యవసాయ శాస్త్రవేతలు



ఉత్తమ రైతును సన్మానిస్తున్న వ్యవసాయ అధికారులు

బళ్లారి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆహార పంటల సాగుతో పాటు వాణిజ్య పంటల సాగు పై రైతులు అవగాహన పెంచుకోలని, పట్టణాలకు సమీపంలో ఉండే రైతులు కూరగాయలు, ఆకకూరల సాగు అలవరుచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేతలు డాక్టర్ బి. క్రిష్ణారావు, డాక్టర్ కే. ఆర్. శ్రీనివాసులు సూచించారు. కూరగాయలు, ఆకకూరలు సాగు చేయడం వల్ల తక్కువ నీటి వినియోగం తో పాటు అలాగే రాబడి కూడా బాగా ఉంటుందని వీరు పేర్కొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ మరియు వాటర్ కంజర్వేషన్, రీసర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో జిల్లాలోని బెళగల్లు తండాలో ప్రపంచ రైతుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత బి. క్రిష్ణారావ్ మాట్లాడుతూ రైతులు కాలానికి అనుగుణంగా ప్రజల ఆహార అలవాట్లను దృష్టిలో ఉంచుకుని పంటలు పండించాలన్నారు. గ్రామీణ రైతులు కూరగాయలు, ఆకకూరలు పండిస్తే సమీపంలోని మార్కెట్‌కు తరలించి లాభాలు పొందవచ్చన్నారు. అలాగే కూరగాలు, మిల్లెట్స్ పండించాని సూచించారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్, అర్బికల్చర్, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ అభివృద్ధికి కృషి

● ఉప్పర సంఘం అధ్యక్షుడు మల్లప్ప



మాట్లాడుతున్న ఉప్పర మల్లప్ప

బళ్లారిరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రూపనగుడి రోడ్డు అయ్యప్ప స్వామి దేవస్థానం సమీపంలో ఉన్న ఉప్పర సమాజ విద్యార్థుల హాస్టల్ అభివృద్ధికి కృషి చేస్తామని ఉప్పర ఉద్యోగస్థుల సంఘం అధ్యక్షుడు ఉప్పర మల్లప్ప పేర్కొన్నారు. సోమవారం హాస్టల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పర విద్యార్థులకు ఉచిత హాస్టల్ సౌలభ్యత, ఉచిత వైద్య పరీక్షలు, ఉప్పర కుల బాంధవుల ఆధ్వర్యంలో ఉచిత సమూహ వివాహాలు, యోగ, మహిళలకు కంప్యూటర్ కుట్టుమిషన్ల శిక్షణ, రిటర్న్ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉప్పర కుల బాంధవులు సమాజంలోని పేదలకు సహకారం అందించాలని ఆయన కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చెల్లాచెదురుగా పడిపోయిన వస్తువులు

రాయచూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసూగూరు పట్టణం ఆజాద్ నగర్‌లో తాళం వేసిన ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. కాలనీలో నివాసముంటున్న గిరిధర్ హిరేమఠ, ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగలు, బంగారు ఆభరణాలు, కొంత నగదు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన యజమాని ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. జాగిలాల సహాయంతో దుండగుల ఆచూకీ తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

● సంయుక్త గని కార్మికుల సంఘం డిమాండ్



జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు నిరసనలో కార్మికసంఘం నాయకులు

బళ్లారి సిటీ,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హరగినడోణి గ్రామ పంచాయతీ పరిధిలోని టీబీఏ గనుల నుంచి కార్మికులకు రావల్సిన పెండింగ్ వేతనం, భవిష్యనిధులను వెంటనే చెల్లించాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సంయుక్త గనుల కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సోమశేఖర్, శివాజీరావ్ మాట్లాడుతూ సుమారు 40 సంవత్సరాల నుంచి 111మంది కార్మికులు పనిచేసే కంపెనీ 2016 మే నెల నుంచి మూసివేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కంపెనీ ప్రభుత్వం నుంచి వచ్చే భవిష్యనిధి, పరిహార సౌలభ్యాలు చట్టపరమైన నిధులను చెల్లించలేదన్నారు. టీబీఏ గనులలో పనిచేసిన కార్మికులకులపై అబద్ధపు కేసులు పెట్టి వేధించారన్నారు. 01-09-2017 నుంచి 01-08-2024 వరకు పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. గనుల కంపెనీలో 40 సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులకు పరిహార ధనం ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సమితి ఆదిమూర్తి, మల్లయ్య, శివమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

బళ్లారి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించే వ్యాఖ్యలు చేశారని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బళ్లారిలో సోమవారం కర్నాటక దళిత సంఘర్ష సమితి (భీమవాడ) చేపట్టిన నిరసన పోలీసుల అరెస్టుకు దారి తీసింది. భీమవాడ సంఘం స్థానికి సంఘం సర్కిల్ నుంచి వాజ్‌పే లే ఓట్‌లోని బీజేపీ కార్యాలయం వరకూ నిరసన చేస్తూ ర్యాలీగా వెల్లాలని నిర్ణయించారు. నిరసన కారులను పోలీసులు అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ పూచీకత్తుపై విడుదుల చేశారు. ఇందుకు దళిత సంఘర్షన కమిటీ రాష్ట్ర నాయకులు ఓంకారప్ప, నాగరాజు, విజయ్, నాగారెడ్డి, సురేష్ తదితరులును పోలీసులు అరెస్టు చేసి విడుదుల చేశారు. అయితే పోలీసుల చర్యను దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. అంబెడ్కర్‌ను అవమానించిన షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



నిరసనలో డీఎస్ఎస్ సభ్యులు

రైతులు అధికారుల సూచనలు పాటించాలి: తహసీల్దార్

కంప్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని, ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాజు శివపుర సూచించారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా జిల్లా కృషి శిక్షణ కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతు.. పంటల సాగుపై అధికారులతో సంప్రదించాలని, అప్పుడే ఉత్తమ సాగు సాధ్యమవుతుందన్నారు. రైతు పంట పండిస్తేనే దేశంలో అందరికీ ఆహారం సాధ్యమన్నారు. ప్రభుత్వం అందించే పరికరాలు, క్రిమికీటక మందులు, విత్తనాలు తదితర వాటిని వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతు దినోత్సవం సందర్భంగా తాలుకాలో కోళ్ల పెంపకంలో పేరు గాంచిన రైతు సన్నరాముడుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్, కంప్లి వ్యవసాయాధికారి సోమశేఖర్, చెన్నప్ప, తిమ్మప్పనాయక్, వి గంగాధర గౌడ, వీరేష్, కొట్టూరు రమేష్, బీవీ గౌడ, జ్యోతి, రేణుకారాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతు సన్నరాముడును సన్మానిస్తున్న తహసీల్దార్ శివరాజ్



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గణితంపై ఆసక్తి కనబరచాలి

● విద్యార్థులకు జిల్లా పంచాయతీ అధికారి వాగీశ్ శివాచార్య సూచన

బళ్లారి సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గణితాన్ని ఆసక్తిగా నేర్చుకునే అలవాటును పెంపొందించుకోవాలని జిల్లా పంచాయతీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీశ్ శివాచార్య విద్యార్థులకు సూచించారు. కర్ణాటక స్టేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ బోర్డు బెంగళూరు, జిల్లాపంచాయతీ బళ్లారి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస్ రామానుజన్ అయ్యంగార్ జయంతిని గణిత దినోత్సవాన్ని జరుపుకంటారన్నారు. డిసెంబరు 22న జాతీయ గణిత దినోత్సవాన్ని ఏటా నిర్వహించుకుంటారన్నారు. శ్రీనివాస రామానుజన్ 32ఏళ్లకే ఎన్నో విజయాలు సాధించిన మేధావి అన్నారు. గణిత రంగానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టులలో అపారమైన జ్ఞానాన్ని పొందాలంటే గణితంలో కూడా నైపుణ్యం అవసరం. విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో గణితాన్ని తెలివిగా నేర్చుకోవాలని సూచించారు. కేపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భైరప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ గణిత గణన తెలుసుకుంటే దైనందిన జీవితంలో చక్కటి వ్యాపార జీవనం సాగించేందుకు దోహదపడుతుందన్నారు. గణిత శాస్త్ర రంగంలో ప్రపంచానికి భారత దేశం అందించిన కృషి ఎనలేనిది, విద్యార్థులు గణిత నేర్చుకోవడంలో చురుగ్గా పాల్గొనాలని, వివిధ అవిష్కరణలు-వినూత్న ప్రయోగాల్లో నిమగ్నమై తమ వంతు సహకారం అందించాలన్నారు. డీడీపీఐ కార్యాలయ గణిత సబ్జెక్ట్ మేనేజర్ బసవరాజ మాట్లాడుతూ గణితం నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లోనే గణిత శాస్త్ర పరిజ్ఞానం సంపాదించి ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. సున్నా యొక్క ప్రాముఖ్యత అందరికీ తెలుసు సున్నా భావనను అందించిన ఘనత భారత్‌దేనన్నారు. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్, ఆర్యభట్ట వంటి అనేక మంది భారతీయులు గణిత రంగానికి తమదైన కృషి చేశారన్నారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ ఆయ్యంగార్ చిత్రపటానికి పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. కేపీఎస్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన గణిత పత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎస్ఐసీ బళ్లారి సెంటర్‌కు చెందిన పి.వెంకటరమణమూర్తి, జీఐపీ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజీవరాయకోట ప్రభుత్వ పాఠశాలలో..

భారతీయ శ్రీనివాస రామానుజన్ ప్రపంచంలోనే గొప్ప గణిత నిపుణులలో ఒకరని కర్ణాటక రాష్ట్రయాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లాధ్యక్షుడు రవిచెళ్ళగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయకోట ప్రభుత్వ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని రామానుజన్ 137వ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. అప్పటి ప్రధాని నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియా పుస్తకంలో గణిత శాస్త్రంలో అతని అసమానమైన ప్రతిభను చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, సుమతి, వైశాలి, శ్వేత,ఉమ్మెహాని, శశమ్మ,రామాంజినేయ, గురుప్రసద్, విజయ ముంద్రగి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్

కంప్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కంప్లి బళ్లారి రోడ్డులో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం కిసాన్ జాగృతి జిల్లా అధ్యక్షులు గంగాధర కోరారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో కిస న్ జాగృతి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండవ చక్కెర ఫ్యాక్టరీగా పేరు గాంచిన దానిని మూసివేయడం తగదన్నారు. ఫ్యాక్టరీ తెరిస్తే తాలుకాలోని 24 గ్రామాల చెరకు రైతులకు ఉపయోగకరమన్నారు. ఫ్యాక్టరీ తెరవడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలన్నారు. రైతులకు అనుకూలమయ్యే చేరుకు పంటలు వేసుకునే విధంగా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు రైతులు పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాంజిని, సయ్యద్ అబిద్ బాషా ఖాద్రి, మహిళా రైతు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉష దేవేంద్ర, కే హర్షిత్, హనుమంతప్ప, లక్ష్మీరెడ్డి, మాబూసాబ్, గాదెలింగప్ప, మస్తాన్ గౌడు, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

సిరుగుప్ప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సెమీక్రిస్మస్ వేడుకలను ఎస్‌వీఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య ఉపాధ్యాయురాలు లిల్లి థామస్ క్రిస్మస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. చిన్నారుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీచర్లు శశికళ, యంకమ్మ పాల్గొన్నారు.



వేషధారణలో చిన్నారులు

దేవదుర్గ పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



మల్లమ్మ, అధ్యక్షురాలు



లక్ష్మి, ఉపాధ్యక్షురాలు

రాయచూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ పురసభకు సోమవారం నిర్వహించిన అధ్యక్ష-ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పురసభ రెండవ టర్మ్ అధ్యక్ష-ఉపాధ్యక్ష ఎన్నిక కోసం నిర్వహించిన ఎన్నికకు ఎన్నికల అధికారిగా తహసీల్దార్ చన్నమల్లప్ప వ్యవహరించారు. బీసీ ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ చేసిన అధ్యక్ష స్థానం కోసం కాంగ్రెస్ పార్టీకి చెందిన మల్లమ్మ శాంతప్ప ఒక్కరే నామినేషన్ వేయగా, సాధారణ మహిళకు రిజర్వ్ చేసిన ఉపాధ్యక్ష స్థానానికి లక్ష్మి ఈరప్ప ఒక్కరే నామినేషన్లు వేయడంతో వారిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కాగా దేవదుర్గ పురసభలో మొత్త 23 మంది సభ్యులుండగా ఇందులో 12 మంది కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా ఏడుగురు బీజేపీ, మరో ముగ్గురు జేడీఎస్‌కు చెందిన వారున్నారు. మరొకరు స్వతంత్ర్య సభ్యుడిగా ఉన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి: డీజీఎం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న డీజీఎం వెంకటకుమార్

కంప్లి, డిసెంబరు 23(ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్క రైతు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు ఎస్‌బీఐ బ్యాంకు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం వెంకటకుమార్ తెలిపారు. సోమవారం నెల్లూడి కొట్టాలలో ఎస్‌బీఐ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌బీఐ నుంచి ఏపీఎవై, పీఎం జేజేపీవై, పీఎం ఎస్‌బీవై పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎంజేజేపీవై పథకంలో చేరిన వారు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబానికి రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. ప్రతి ఒక్కరు ఎస్‌బీఐలో సమయానికి రుణాలు పొంది, సకాలంలో చెల్లించాలని తెలిపారు.ఏజీఎం రవి రామమూర్తి, బ్యాంకు మేనేజర్ వెంకటేష్, సోమనగౌడ, శేఖర్‌గౌడ, వసంత్ కుమార్, వీరేషప్ప, ఖాసీమ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: డీఎస్పీ

సిరుగుప్ప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ వెంకటేష్ సూచించారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, క్రైమ్‌ఎఎస్ఐ శ్రీనివాస, పోలీసులు పాల్గొన్నారు.



జెండా ఊపి బైకుర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేష్

హోసూరు జోన్

అమిత్‌షా వ్యాఖ్యలపై చర్యలకు డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ గోపినాథ్

హోసూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కపట్ల కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఎంపీ గోపినాథ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో షా వ్యాఖ్యలు సముచితంగా లేవన్నారు. ఆయనపై ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం చేయని జనసంఘ్, బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంస్థల తీరు గురించి మండిపడ్డారు. బీజేపి ఎంపీలు లేవనెత్తిన ప్రశ్నకు పార్లమెంట్‌లో సామాజిక సభ నిర్వహించేందుకు ప్రతిపక్ష ఎంపీలను రానీయకుండా బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారన్నారు.

గడ్డి లారీ దగ్ధం.. అపారనష్టం

హోసూరు(క్రైం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డి లోడుతో వెళ్తున్న ఐచర్ లారీలో మంటలు చెలరేగడంతో అపారనష్టం వాటిల్లింది. కర్ణాటక రాష్ట్రం మైసూరు నుంచి హోసూరు మీదుగా కృష్ణగిరి సమీపంలోని కావేరీపట్టణంకు లారీలో ఎండుగడ్డిని తరలిస్తుండగా ఐచర్ లారీ తమిళనాడు సరిహద్దులోని జూజువాడి వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా మంటలు ప్రజ్వలించి లారీ మొత్తం వ్యాపించడంతో ట్రక్కు పూర్తిగా దగ్ధమైంది. లారీని నడుపుతున్న కృష్ణగిరి సమీపంలోని నేడంగల్ మేటూరు గ్రామానికి చెందిన పళని(31) మంటలను గమనించగానే వెంటనే కిందకు దిగి అకస్మాత్తుగా తప్పించుకున్నాడు. మంటలను గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది చాలా సేపు శ్రమించి మంటలు ఆర్పారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సిప్‌కాట్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సర్వీస్ రోడ్లపై వాహనాలను మళ్ళించారు.



కాలిపోతున్న గడ్డిలారీ

ఏనుగుల సంచారంతో రైతుల బెంబేలు

హోసూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దక్షిణ పినాకిని నదికి కెలవరపల్లి డ్యాం కింద దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ పరిధిలో ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట కోతకు సిద్ధంగా ఉంది. అయితే వారం రోజులకుపైగా ఏనుగుల సంచారం ఉండడంతో రైతులలో ఆందోళన నెలకొంది. డెంకణీకోట, తళి, అంచెట్టి, కృష్ణగిరి తదితర ప్రాంతాలలో సుమారు వర్షాధారిత 3వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేస్తున్నారు. అదేవిధంగా కెలవరపల్లి డ్యాం నీటితో 8వేల ఎకరాల్లో వరి సాగు అవుతోంది. హోసూరు సమీపంలోని పెద్దకూడ్లు, చిన్నకూడ్లు, తొరపల్లి, నలగనకొత్తపల్లి, గోపసంద్రం , తదితర 20 గ్రామాలల్లో వరి పండించారు. ప్రస్తుతం వరి పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. సరిహద్దులోని కర్ణాటక బన్నేరుఘట్ట అడవుల నుంచి హోసూరు రిజర్వ్‌కు 150కు పైగా ఏనుగులు వలస వచ్చినట్టు తెలుస్తోంది. హోసూరు అటవీప్రాంతంల్లో ఇప్పటికే శాశ్వతంగా ఉన్న వందకు పైగా ఏనుగులతో పాటు వివిధ గుంపులుగా విడిపోయి జవలగిరి, డెంకణీకోట, హోసూరుల్లోని సానమావు ప్రాంతాలలో సంచరిస్తున్నాయి. హోసూరు ప్రాంత రైతుల డిమాండ్ మేరకు ఏనుగులన్నింటిని డెంకణీకోట జవలగిరి తదితర ప్రాంతాలకు తరిమారు. అయితే ఏనుగుల గుంపులు తరచూ వేర్వేరు గుంపులుగా పొలాలవైపు వస్తున్న తరుణంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను కోసి సురక్షిత ప్రాంతాలలో నిల్వ చేసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

బాలికల వసతి నిలయం ఘటనపై అధికారులు స్పందించాలి

● కరవే జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ సీకే జైన్

రాయచూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాజలబండా మొరార్జీదేశాయ్ బాలికల వసతి నిలయ శౌచాలయం వద్ద మొబైల్ ఉంచిన నిందితుడిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని కర్నాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ సీకే జైన్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా దాచి ఉంచిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలోను ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే తిరిగి అలాంటివి పునరావృతమైయ్యాయన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరవే సభ్యులు